ప్రజాశక్తి

సోమవారం 15 సెప్టెంబర్ 2025 5 శ్రీ సత్యసాయి

జిల్లా ప్రత్యేకతను కాపాడుతా : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి జిల్లా ప్రత్యేకతలు కాపాడుతూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా విధులు నిర్వర్తిస్తానని అందుకు జిల్లా ప్రజలు సహకరించాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎన్. సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ప్రతి ఏరియాలో జరుగుతున్న నేరాల వివరాలను తెలుసుకుని వాటి నియంత్రణకు చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలు సైతం పోలీసులతో స్నేహపూర్వకంగా మెలిగి సమస్యలను పరిష్కరించుకోవాలని, సమస్యలకు తావివ్వకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ

కార్మికులను నిర్లక్ష్యం చేస్తే ప్రతిఘటన

- సమస్యల పరిష్కారమే అజెండాగా పోరాటాలు
- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మాలిని మెస్తా
- అనంతలో ముగిసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలు
- రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక
- అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వరలక్ష్మి, దయా రమాదేవి

సమావేశంలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మాలిని మెస్తా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులను నిర్లక్ష్యం చేస్తే ప్రతిఘటన తప్పదని దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే అజెండాగా భవిష్యత్ పోరాటాలు నిర్వహిస్తామని ప్రజా కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంగా రెండు రోజులుగా జరిగిన ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలు చైతన్య భరితంగా సాగాయి. గణేనాయక్ భవన్‌లోని రంజనా నీరులా ప్రాంగణంలో ఆదివారం రెండో రోజు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పాల్గొన్న ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. భవిష్యత్ పోరాటాలే అజెండాగా పలు తీర్మాణాలు చేశారు. ఈ తీర్మాణాలకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మహాసభల ముగింపు సందర్భంగా పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా కార్మిక, కర్షక సంఘాల నాయకులు మద్దతుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పరిష్కారం చూపలేకపోతోందన్నారు. ప్రభుత్వాల్లో మనుషులు మారుతున్నారే తప్ప విధానాలు మారలేదన్నారు. ప్రపంచ బ్యాంకు ప్రపంచీకరణ విధానాలు అనుసరిస్తు ప్రజలపై భారాలు మోపుతున్నాయని తెలిపారు. అదాని, అంబాని ఆస్తులు పెంచడానికి కార్పొరేట్ విధానం తీసుకొచ్చి విద్య, వైద్యం రంగాల సేవలు ప్రజలకు దూరం చేస్తున్నారన్నారు. ప్రజల్లో అంతరాలు పెరిగి పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు. సేవా రంగం ఉద్యోగులు, ఉత్పత్తి రంగాల కార్మికులు, కర్షకులతోనే సంపద సృష్టి జరుగుతుందని అలాంటి సంపద సృష్టికర్తలను ప్రోత్సాహం లేదని అన్నారు. మోడీ ప్రభుత్వం మాత్రం సంపద సృష్టికర్తలు అదాని, అంబానిలని గొప్పలు చెబుతు వారి ఆస్తులు పెంచడానికి పని చేస్తున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలు సవరించి మరింత దోపిడీలకు గురి చేస్తున్నారని తెలిపారు. హిందూత్వ పేరుతో చీలికలు సృష్టించి అధికారం కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోనూ పి4 విధానం అంటూ దత్తత తీసుకుంటామంటూ మాటల్లో చెప్పడం తప్ప చేతల్లో ఏమి లేదన్నారు. ఉచితంగా అందాల్సిన సేవలను ప్రయివేటీకరిస్తే ఎలా పేదరికం తగ్గుతుందని ప్రశ్నించారు. మోడీ చంద్రబాబులు పేదరికాన్ని పెంచుతున్నారని విమర్శించారు. పెట్టుబడి దారీ వ్యవస్థ పరిష్కారం చూపలేకపోతుందని సోషలిజమే అన్నింటికి పరిష్కారం లభిస్తుందని అన్నారు. మార్పు కోసం సిఐటియు పోరాడుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.3 వేలు చెల్లించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సెంట్రల్ కిచెన్ విధానాన్ని కడప జిల్లాలో 2 మండలాల్లో ప్రారంభించిందన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఉపాధి కోల్పోకుండా వారిని అలాగే కొనసాగించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మాలిని మెస్తా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కోతలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అన్యాయంగా ఉందన్నారు. గతంలో రూ.13900 కోట్లు కేటాయిస్తే 2025-26కు రూ.12500 కోట్లు కేటాయించిందన్నారు. కార్మికులు 3 గంటలు మాత్రమే పని చేస్తున్నారంటూ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం అన్యాయంగా ఉందన్నారు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క వేతనం చెల్లిస్తున్నారన్నారు. కేరళలో రూ.16 వేలు, హర్యానాలో రూ.7,500, కర్నాటకలో రూ.4, 500, ఆంధ్రప్రదేశ్‌లో రూ.3 వేలు వేతనాలు ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా కార్మికులకు రూ.15 వేలు కనీస వేతనం ఇవ్వాలని బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కర్నాటక తరహాలో ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో వేతనాలు ఇస్తున్నట్లు కార్మికులకు 12 నెలలు వేతనాలు ఇవ్వాల్సిందే నన్నారు. డిమాండ్ల సాధనకు డిసెంబర్‌లో కేంద్ర మంత్రుల నివాసాల వద్ద దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ కనీస వేతనాల అమలు, ప్రమాద బీమా, మృతి చెందిన వారికి ఎక్స్‌గ్రేషియా రూ.లక్ష, గాయాలైన వారికి వైద్య ఖర్చులకు రూ.75 వేలు ఇవ్వాలన్నారు. గ్యాస్, స్టౌవ్‌లు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. 2 జతల యూనిఫాం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నూతన రాష్ట్ర కమిటీ సభ్యులతో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

మహా సభ తీర్మాణాలు

రాష్ట్ర మహాసభల సందర్భంగా భవిష్యత్ పోరాట కార్యచరణపై సభ ఏకగ్రీవంగా తీర్మాణాలు చేసింది.

1. విద్యా రంగంలో ప్రయివేటీకరణ విధానాలు ఉప సంహరించాలి.
2. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల కనీస వేతనాలు రూ.15 వేలు అమలు చేయాలి.
3. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం, ఇఎస్ఐ అమలు చేయాలి.
4. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి
5. నూతన విద్యా విధానం రద్దు చేయాలి.

రాష్ట్ర నూతన కమిటీ

41 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. వీరిలో 17 మంది ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నికయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలుగా జి.వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా దయా రమాదేవి, కోశాధికారిగా మద్దూరి నాగమణి (అనంతపురం), ఉపాధ్యక్షులుగా ఏ.మహాలక్ష్మి (శ్రీకాకుళం), బి.సుధారాణి (విజయనగరం), ఎం.నాగమణి (ఏలూరు), శివకుమారి (పల్నాడు), ఎంసిహెచ్.సుప్రజ (ఎన్టీఆర్ జిల్లా), కల్పన (ప్రకాశం), ఎస్‌కె. రెహానా (నెల్లూరు), సహాయ కార్యదర్శిగా వై.శాంతి (పార్వతీపురం మన్యం), మంగశ్రీ (విశాఖపట్టణం), నాగవరలక్ష్మి (అంబేద్కర్ కోనసీమ), జి.సమ్మక్క (కృష్ణ), విజయమ్మ (తిరుపతి), పుష్ప (రంపచోడవరం) కర్నూలు జిల్లాకు కోఆప్షన్‌ను కేటాయించారు.

జి. వరలక్ష్మి

దయా రమాదేవి

మద్దూరి నాగమణి

టిడిపి అనుబంధ కమిటీల నియామకం

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపి జిల్లా అధ్యక్షులు ఆదివారం టిడిపి హిందూపురం టౌన్ అనుబంధ కమిటీల అధ్యక్షులను నియమించారు. తెలుగు యువత అధ్యక్షులుగా బేవినాహళ్లి రామకృష్ణ, తెలుగు మహిళా అధ్యక్షులుగా కిరికెర అంజలి, బిసి సెల్‌కు సంతేబిదనూరు బాబు, ఎస్సీ సెల్‌కు బాలంపల్లి సాయి కుమార్, ఎస్టీ సెల్‌కు గోళాపురం శ్రీనివాసులు, మైనార్టీ సెల్‌కు కగ్గల్లు షానూర్ బాషా, టిఎన్‌టియూసికి తూమకుంట నరేష్ బాబు, ఐ-టిడిపి అధ్యక్షులుగా కొటిపి ప్రసన్న కుమార్‌ను నియమించారు.

పకడ్బందీగా ఆహార భద్రత చట్టం అమలు

ఫుడ్ సేఫ్టీ అథారిటీ జిల్లా అధికారి రామచంద్ర

ఫుడ్ సేఫ్టీ అథారిటీ జిల్లా అధికారి ఎస్ రామచంద్ర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆహార భద్రతా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఫుడ్ సేఫ్టీ అథారిటీ సత్యసాయి జిల్లా అధికారి ఎస్ రామచంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తమ శాఖ పరిధిలో అమలు పర్చుతున్న చర్యల గురించి వివరించారు.

ప్రశ్న : జిల్లా ప్రజల ఆహార భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: జిల్లాలోని హోటళ్లు,రెస్టారెంట్లు, కిరాణా కొట్లను ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తురు. ఎవరైనా అధిక ధరలకు సరుకులు అమ్మిన లేక కాలం చెల్లిన వాటిని విక్రయించినా అలాంటి వారిపై చర్యలు తీసుకొని జరిమానాలు విధిస్తున్నాం. అదేవిధంగా రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలను తరచూ తనిఖీ చేస్తున్నాం. వినియోగదారుల ఫిర్యాదు మేరకు కల్తీ నూనెలు కాలం చెల్లిన సరుకులు, ఫ్రిజ్జులలో ఎక్కువ కాలం నిలువ ఉంచిన ఆహారం పెట్టినా వారి పై తగిన చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : ఆహార భద్రత చట్టం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా ?

జ: ప్రభుత్వం ఆహార భద్రత చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. వినియోగదారులకు అందించే సేవలపై హోటళ్లు,రెస్టారెంట్లు, కిరాణా కొట్లు, డాబాలు యజమానులకు సూచనలు ఇస్తున్నాం. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా నుండి వారికి లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. లైసెన్సులు లేనిరెస్టారెంట్లను మూసివేసి వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నాం. అంతేకాక కల్తీ ఆహారం చేసేవారిపై జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ప్రకారం కేసులు నమోదు చేస్తున్నాం.

ప్ర : జిల్లా ప్రజలకు మీరిచ్చే సలహాలు సూచనలు ఏవీ?

జ: వినియోగదారులు మోసపోకుండా ఆహార భద్రత కల్పించడం పలు చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా హోటళ్లు, దాబాలు, కాఫీ షాపులు, తినుబండారాలకు సంబంధించి విక్రయితలు తమ లైసెన్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో పాటు క్యూఆర్ కోడ్‌లను తమ దుకాణాల వద్ద ప్రదర్శించే విధంగా సూచించాం. దాన్ని వినియోగదారులు గ్రహించాలి. ప్రజలు ఆహార భద్రత పరిశుభ్రత సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చు. ఆహార ఉత్పత్తులపై తప్పుదారి పట్టించే ప్రకటనలపై ఫిర్యాదులు చేయవచ్చు.

ప్ర : జిల్లాలో ఇటీవల జరిగిన దాడుల్లో ఎలాంటి పురోగతి సాధించారు. ?

జ: శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో ఇటీవల కదిరిలో ఒక సంఘటన చోటుచేసుకుంది. హోటల్ యజమాని నిబంధనలు పాటించకుండా ఎక్కువ కాలం ఆహార పదార్థాలను నిల్వ ఉంచి సరఫరా చేస్తుండడం తదితర అంశాలు తమ తనిఖీలో బయటపడ్డాయి. దీంతో ఆ హోటల్ నిర్వాహకులపై చర్యలు తీసుకున్నాం. ఆహార పదార్థాల శాంపుల్‌ను సంబంధిత ల్యాబుకు పంపాము. వాటి రిపోర్టు రాగానే తగిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులను మోసగిస్తే ఎలాంటి వారిపైననా చర్యలు తీసుకుంటాం.

ప్ర : భద్రత ప్రమాణాలు విస్మరిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: నిత్యావసర వస్తువులైన బియ్యం, కూరగాయలు, పప్పులు, ఉప్పు, మాంసం, గ్రుడ్లు ,పండ్లు, నూనె లాంటి వస్తువులతోపాటు డెయిరీ ఉత్పత్తులైన పాలు, పెరుగు, శీతల పానీయాలు, బేకరీ ఉత్పత్తులు కేకులు ,బ్రెడ్లు తినుబండారాలను ఎప్పుడు ప్యాక్ చేశారు వాటి ఖరీదు ఎంత వాటి బరువు ఎంత ఎప్పటి వరకు వినియోగించాలనే అంశాలను పరిశీలించి, కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్నారని తేలితే అలాంటి వారిపై చర్యలు తీసుకొని నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే జరిమానాలు విధిస్తాం.

'ఉపాధి'కి ఏదీ హామీ..?

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫోటో)

- జిల్లాలో రూ.75.50 కోట్లు, పెనుకొండ నియోజకవర్గంలో రూ.రూ.6.09 కోట్ల బకాయి
- రూ.80 కోట్ల మెటీరియల్ బిల్లులు పెండింగ్

జాతీయ గ్రామీణ హామీ పథకంలో శ్రామికులకు పస్తులు తప్పడం లేదు. రోజంతా స్వేదం చిందించినా గొంతులోకి ముద్ద దిగడం లేదు. ఉపాధి హామీ కూలీలకు మేనెల నుంచి వేతనాలు స్తంభించడంతో శ్రమజీవులు లబోదిబోమంటున్నారు వెరసి కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారు ఉపాధి కూలీ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారా అని నిరీక్షిస్తున్నారు. ఇక మెటీరియల్ కాంపోనెంట్ బకాయిలు సైతం విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. అప్పులు చేసి పనులు చేస్తే బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు.

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్య సాయి జిల్లాలోని 32 మండలాల్లో 467పంచాయతీల పరిధిలో 2,76,517 జాబ్ కార్డులున్నాయి. 3,82,819 మంది ఉపాధి కూలీలున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో పెనుకొండ మండలంలో 3,320 మంది, సోమందేపల్లి మండలంలో 3,951మంది, రొద్దం మండలం లో 700 గోరంట్ల మండలంలో 850, పరిగి మండలంలో 4,657 మంది కూలీలు ఉపాధి హామీ పథకం పనులు చేశారు. పెనుకొండ మండలంలో రూ.1.45 కోట్లు, సోమందేపల్లి మండలం రూ.1.44 కోట్లు, రొద్దం రూ.1.50 కోట్లు, గోరంట్లరూ.1కోటి, పరిగి రూ.0.70 కోట్లు ఉపాధి వేతన బకాయిలున్నాయి.

జిల్లా వ్యాప్తంగా రూ.76.50 కోట్ల బకాయిలు..

వలసలు నియంత్రించి ఉన్న ఊళ్లోనే పని కల్పించేందుకు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యసాధనకు దూరంగా ఉంటోంది. సకాలంలో వేతనాలు మంజూరు చేయకపోవ డంతో కూలీలు పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం వ్యవసాయ పనులు కాస్త నెమ్మదించాయి. ఫలితంగా కూలీలు ఉపాధి పనుల వైపు ఆసక్తి చూపుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ 20 నుంచి 30 వేల మంది వరకు ఉపాధి పనులకు హాజరవుతున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ వేతనాల కింద రూ.76.50 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో కూలీకి సగటున రూ.15వేల నుంచి రూ.20 వేల వేతనం అందాల్సి ఉంది. ఉపాధి కూలీ డబ్బులు వస్తాయని భావించి కిరాణా దుకాణాల్లో అప్పులు చేశారు. వాటిని తీర్చుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే త్వరలోనే విడుదలవుతాయని చెబు తున్నారే తప్ప.. ఎప్పుడన్నది కచ్చితంగా చెప్పడం లేదని కూలీలు ఆవేదన చెందుతున్నారు.

మిగిలిన 28 లక్షల పని దినాలు..

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 75 లక్షల పని దినాలు కేటాయించగా, సెప్టెంబర్ 10 తేదీ నాటికి 48.12 లక్షల మందికి పనిదినాలు పూర్త య్యాయి. మరో ఎనిమిది నెలల కాలంలో 27.83 లక్షల పని దినాలు పూర్తి కావాల్సి ఉంది. తరచూ బిల్లులు రాకపోయినప్పటికీ ఇంటి వద్ద ఉండలేక, గ్రామాల్లో ఉన్న వారి వద్ద వడ్డీకి అప్పులు చేసి అవసరాలు తీర్చుకుంటూ కూలీలు పనులకు వెళ్తున్నారు. ప్రతి వారం బిల్లులు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

సోమందేపల్లి మండల గుడిపల్లి లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ మహిళా కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శివ నాగరాణి.(ఫైల్ ఫోటో)

రోజుకు సగటున రూ.276 కూలి

ఉపాధి పథకంలో కష్టపడి పనిచేస్తే సగటున రోజుకు రూ.276 నుంచి రూ.343 వరకు వస్తోంది. ఆ డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. సాధారణంగా ఉపాధి పథకంలో ప్రతి వారం కూలీ డబ్బులు చెల్లించడం ఆనవాయితీ. ప్రతి వారం కూలి డబ్బులు చెల్లిస్తే ఇంట్లో అవసరాలు, నిత్యావసరాలు కొనుగోలు చేసుకుంటారు. మే మాసం నుంచి ఉపాధి వేతనాల చెల్లింపులు ఆగిపోయాయి. ప్రతి రోజూ క్రమం తప్పకుండా పనులకు వెళుతున్నా.డబ్బు తమ ఖాతాల్లో జమకావడం లేదని కూలీలు వాపోతున్నారు. వెరసి వారికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. నెలల తరబడి డబ్బు ఇవ్వక పోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు.

పేరుకుపోయిన రూ.80 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ బిల్లులు

ఉపాధి హామీ పనుల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెనేజీ, కల్వర్టు పనులు హడావుడిగా చేపట్టారు. మినీ గోకులం, మొక్కల పెంపకం తదితర పనులు చేపట్టారు. ఇందుకు ఇప్పటి వరకు రూ.80 కోట్ల బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. అప్పులు చేసి మరీ పనులు చేపడితే సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో చేసిన అప్పు లకు వడ్డీ చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ప్రధానంగా రహదారుల పనుల్లో ఎక్కువ శాతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం బిల్లులు అందక వారు ఆవేదన చెందుతున్నారు.

ఉపాధి కూలీల ఆవేదన..

బిల్లులు సరిగా రాకపోవడంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా తగ్గిపోతుంది. 12వారాలుగా వేతనాలు అందక కుటుంబ అవసరాలతో పాటు పిల్లల చదవులు, ఇతరత్రా అవసరాల కోసం ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

అధికారులు నిర్లక్ష్యం వీడి ఉపాధి కూలీల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి. కూలీల వేతనాలకు సంబంధించి ప్రతి వారం సక్రమంగా బిల్లులు అందే విధంగా చర్యలు చేపట్టాలి. కూలీలు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వేతన బకాయి నిధులను విడుదల చేయాలి.

హరి,
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

వాహనాల మితిమీరిన వేగం..

తరచూ ప్రమాదాలు..!

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మడకశిర పట్టణం దినదినాభివృద్ధి చెందుతుంది. ఈ క్రమంలోనే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ కూడా పెరిగిపోయింది. దీనికి తోడు కొత్తగా కొడికొండ చెక్‌పోస్ట్, శిర, మడకశిర మీదుగా హైవే కావడంతో నిత్యం పట్టణం మీదుగా భారీ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో కూడా వాహన చోదకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడపుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు ప్రమాదాల్లో మరణించిన దాఖలాలు చాలానే ఉన్నాయి. అంతేకాకుండా వాహన చోదకులు పాదచారులను ప్రమాదాలకు గురి చేసి ఆపకుండా తప్పించుకుపోయిన సంఘటనలు లేకపోలేదు. వీటికి తోడు పట్టణంలో పెరిగిన వాహనాల రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల సమయంలో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దుకాణాలు ప్రారంభం కావడంతో ప్రధాన రోడ్లన్నీ రద్దీగా మారుతాయి. తిరిగి సాయంత్రం విద్యాసంస్థలు, కార్యాలయాల వేళలు ముగియడంతో విద్యార్థులు, ఉద్యోగులతో రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. ఆయా సమయాల్లో వాహనాలు అధిక వేగంతో నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పట్టణంలో ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, భారీ వాహనాలను నిర్ధిష్ట సమయంలో మాత్రమే నిర్ధిష్ట వేగంతో రాకపోకలు సాగించే పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణ ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని, మైనర్లకు వాహనం ఇవ్వకూడదని మేధావులు సూచిస్తున్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్పీ వి.రత్నను సన్మానిస్తున్న నూతన ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీలు

మీ సహకారం మరువలేనిది : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు, మీడియా సహకారం మరువలేనిదని ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. జిల్లాలో 15 నెలల పాటు విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎస్పీ వి.రత్నను ఆదివారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతన ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, డీఎస్పీలు ఘనంగా సన్మానించారు. నూతన ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సిబ్బంది సంక్షేమం కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. తనవంతు జిల్లా పోలీస్ శాఖ సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారం మరువలేనన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బందోబస్తు నిర్వహణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. డీఎస్పీలు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో సమస్యలు ఎదురైనా ఎస్పీ మాకు అందించిన సహకారం ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం ఎస్పీ వి.రత్నను నూతన ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీని ఓపెన్ టాప్ జీప్‌పై పూల వర్షం కురిపిస్తూ తాళ్లతో లాగి అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయకుమార్, నరసింగప్ప, శివనారాయణస్వామి, హేమంత్ కుమార్, ఆదినారాయణ, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, ఎస్పీ సిసి చిరంజీవి, ఆర్ఐలు వలి, మహేష్, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు షరణి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక శ్రీజ్ఞానసాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న షరణి రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ఐ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపల్ కె.క్రిష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం నగరంలోని కోవూరునగర్ విద్యారణ్యస్కూల్‌లో ఈ నెల 13వ తేదీ ఎంకె స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ ఫెన్సింగ్ ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో షరణి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఫెన్సింగ్ క్రీడ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఇలాంటి క్రీడల్లో పాల్గొనడం వల్ల సర్టిఫికెట్ల ప్రాధాన్యం పెరుగుతుందని, ప్రత్యేక రిజర్వేషన్ పత్రాల ద్వారా ఉన్నత చదువులు, ముఖ్యంగా మెడికల్ (ఎంబిబిఎస్), ఇంజినీరింగ్, తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో సీటు సాధించేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ శ్రీనివాసులు, ఆర్ఐఒ వెంకటరమణనాయక్, ఎస్‌జిఎఫ్ఐ జిల్లా సెక్రటరీ శ్రీనివాసులు, శకుంతలమ్మ, ఎంకె స్పోర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఎ.మురళీకృష్ణ, కోచ్ రాహుల్, స్కూల్ డైరెక్టర్ కీర్తన, హెడ్ మాస్టర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్‌లో సోమవారం యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అర్జీలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. అలాగే కలెక్టరేట్‌లోని మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవచ్చన్నారుర. గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాకపోతే 1100 నెంబర్‌కి కాల్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

చిత్రావతి నది అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణ సమీపంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పరిశీలించారు. పల్లె కూటమి నాయకులతో కలిసి చిత్రావతి నది ప్రాంతంలో పర్యటించి అభివృద్ధి పనులపై అక్కడ ఉన్న ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నది పరివాహక ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి జోయాలుకాస్ జ్యువెల్లరీ కంపెనీ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధులు కోటి రూపాయలకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో స్నానపు ఘాట్, పిల్లల పార్కు, తదితర పనులు చేపడుతున్నామన్నారు. సత్య సాయి శతజయంతి ఉత్సవాలకు మునుపే అభివృద్ధి పనులన్నీ పూర్తవుతాయన్నారు. అంతకుముందు స్థానిక సాయిరామం అతిథి గృహంలో టిడిపి మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ కుమారుని వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు సాలక్కగారి శ్రీనివాస్, సామకోటి ఆదినారాయణ, నాయకులు రామ్, లక్ష్మణ్, సింగిల్‌విండో అధ్యక్షులు శ్రీరామ్‌రెడ్డి, మమ్మనేని వెంకటరాముడు పాల్గొన్నారు.

చిత్రావది నది వద్ద జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి పల్లె

అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని షాదీఖానా ఫంక్షన్ హాలులో ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో సిఎస్ శ్రీదేవి అధ్యక్షతన అంగన్వాడీ మినీ వర్కర్ల విజయోత్సవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఈఎస్ వెంకటేష్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, అంగన్వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీదేవి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దిల్షాద్ హాజరయ్యారు. ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాలు చేసిన ఫలితంగా 5,126 మంది మినీ వర్కర్లలో 4,687 మందిని మెయిన్ వర్కర్లుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సిఐటియు జిల్లా కమిటీ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ తరపున కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. మరో 1,810 మందికి సంబంధించి పదో తరగతి సర్టిఫికెట్లు సరిగా లేవని పెండింగ్‌లో పెట్టారని, వారిని కూడా వెంటనే మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మినీ వర్కర్లుగా 684 సెంటర్లు ఉండగా ఇంకా 136 పెండింగ్ ఉన్నాయని, వారందరికీ సర్టిఫికెట్లు సరిచేసి మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. గుజరాత్‌లో అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ. 26,800, హెల్పర్లకు రూ. 20,300 అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. మూడవ, నాలుగో తరగతి ఉద్యోగాలుగా గుర్తిస్తామని కూడా తెలిపిందన్నారు. గుజరాత్ తరహాలో ఎపిలో అంగన్వాడీ వర్కర్లందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ఈ నెల 20, 21 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభల్లో అనేక కర్తవ్యాలను రూపొందించి రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి కనీస వేతనాలు పెంచేలా సిఐటియుగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ పెదపల్లి బాబా, ఆఫీస్ కార్యదర్శి సిద్దు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే వెంకటేష్, 12 ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులు బావమ్మ, ఉషారాణి, పద్మావతి, రామాంజనమ్మ, శోభ, సుజాత, రజియా, భారతి, నాగమణి, మణిమాల, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షులు అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్య ల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని ప్రైవేట్ పాఠశాలల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పివి.అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వాల్మీకి స్కూల్‌లో ఆదివారం సాధన స్కూల్ సాధిక్‌బాషా అధ్యక్షతన ఉమ్మడి జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం మొట్టమొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సంఘం స్థాపించినప్పటి నుంచి యజమాన్యాలకు ఎదురైన వివిధ సమస్యలను ఎలా పరిష్కరించారు.. భవిష్యత్తులో సంఘం ఎలా ముందుకెళ్లాలి.. భవిష్యత్తు ప్రణాళిక లపై చర్చించారు. స్కూల్ కరస్పాండెంట్లు వివిధ అంశాలపై చర్చించారు. వారి సమస్యలను ప్రస్తావించారు. వాటిని సానుకూలంగా పరిష్కరించడానికి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా సిఆర్ఒ కోటిరెడ్డి రవిచంద్రారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం గౌరవాధ్యక్షులు ముదిగుబ్బ సింగారెడ్డి, అధ్యక్షులు పలవల అనిల్‌కుమార్‌రెడ్డి, గౌరవ సలహాదారులు శివశంకర్, గ్రేట్‌వే కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు జాహ్నవి స్కూల్ బాషా, ప్రధాన కార్యదర్శి సాయిగీత, కోశాధికారి వారాధి స్కూల్ నాయుడు, డిసిఐబి మెంబర్ వేణుగోపాల్, ఉప కార్యదర్శి తలపుల విశ్వేశ్వర్‌రెడ్డి, అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఉపాధ్యక్షులు రాఘ వేంద్ర, నగర అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, తాడిపత్రి డివిజన్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉప కార్యదర్శి బాబాయ్య, కదిరి డివిజన్ నగర గౌరవాధ్యక్షులు సలీం బాషా, అధ్యక్షులు సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర, వర్కింగ్ ప్రెసిడెంట్ అలీంబాషా, కోశాధికారి కుమార్, గౌరవ సలహాదారు కిరణ్, ధర్మవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి నరేంద్ర, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు అనిల్‌కుమార్‌రెడ్డి

నిబంధనలు పాటించకుండా నాసిరకంగా చేపట్టిన కాలువ పనులు

కాలువ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు..!

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బలో ఎన్‌హెచ్-42 హైవే ఇరువైపులా చేపట్టిన సైడ్ కాలువ పనుల్లో నాణ్యత పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సైడ్ కాలువ పనులను నాసిరకంగా చేస్తున్నారని, రోడ్డు వెడల్పు తగ్గించారన్న వాదనలు ఉన్నాయి. సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రోడ్డుకు 5 మీటర్ల దూరంలో వుండాలి.. కానీ 2 మీటర్లు దూరం కూడా ఉండటం లేదన్నారు. తక్కువ వెడల్పు ఉండటం వల్ల ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఇంతకు మునుపు ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయన్నారు. దీనికి తోడు పనులు నాసిరకంగా చేపడుతున్నారని, దీనిపై జెఈని ప్రశ్నించగా సమాధానం దాటవేశారన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సైడ్ కాలువ పనులు నాణ్యతగా చేపట్టడంతో పాటు రోడ్డు వెడల్పు చేయాలన్నారు. లేనిచో ప్రజలు, కార్మికులు, నాయకులను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



లక్ష్మీప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల నాయకులు

ఎపిఐఐసి డైరెక్టర్ లక్ష్మీప్రసాద్‌కు అభినందనలు

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని నిడిగల్లు గ్రామానికి చెందిన చల్లా లక్ష్మీప్రసాద్‌ను రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల(ఎపిఐఐసి) శాఖ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీంతో ఆదివారం టిడిపి మండల కన్వీనర్ కూచి రాము, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, నాయకులు మద్దినేని రమణ అనంతపురంలోని ఆయన నివాసంలో చల్లా లక్ష్మీప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తాడిమర్రి మండలం నుంచి రాష్ట్రస్థాయి పదవి పొందిన తొలి వ్యక్తిగా చల్లా లక్ష్మీప్రసాద్ నిలుస్తారని వారు పేర్కొన్నారు.

వానవోలు పాఠశాల అభివృద్ధికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని వానవోలు గ్రామ జడ్పీ హెచ్ఎస్ 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం వారి పాఠశాల అభివృద్ధికి రూ. 20వేలు అందజేశారు. అలాగే శ్రీరంగనాథస్వామి ఆలయానికి రూ. 12,500, శివాలయానికి రూ. 12,500 అందజేశారు. వారు మాటాడుతూ మేము చదువుకున్న పాఠశాలలో మౌలిక వసతుల కోసం తమవంతు సాయం చేశామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గట్టు చంద్రశేఖర్‌రెడ్డి, కోమనేని శ్రీనివాసులు, గుత్తా ఆంజనే యులు, పద్మనాభయ్య, శేషాద్రి, శ్రీనివాసులు, శంకర, కృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నీ విజేతలకు బహుమతి

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం ఫ్రెండ్లీ షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్ పోటీలో అశోక్, వేమనారాయణ జోడిపై విజయ్, సిరాజుద్దీన్ జోడీ 19/21 తేడాతో విజయం సాధించారు. అనంరం విన్నర్, రన్నర్స్ జోడీలకు పంచాయతీ సెక్రటరీ శంకర్ బహుమతులు అందజేశారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని తాళికెర పంచాయతీ పరిధిలోని బిటి.పల్లి గ్రామానికి చెందిన 40 వైసిపి కుటుంబాలు ఆ పార్టీని వీడి టిడిపిలో చేరాయి. మడకశిర పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో వైసిపి నాయకులు హనుమంతేగౌడ్, రంగస్వామి, ఈరన్న, గోవిందప్ప, ప్రసన్నకుమార్, భోజరాజు, హరీష్, ఆనందప్ప, శివన్న, శ్రీధర్, రాజన్న, నారాయ ణప్ప, పాండప్ప, వనజాక్షి, జయప్రద, నాగమ్మ, సరోజమ్మ, లక్ష్మి, శ్వేత, భాగ్యమ్మ, జయమ్మతో పాటు దాదాపు 40 కుటుంబాలు టిడిపిలో చేరారు. వారికి గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా వేసి టిడిపిలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్లు లక్ష్మీనరసప్ప, తిప్పేస్వామి, నాగరాజు, నాయకులు సుబ్బరాయుడు, ఈరన్న, చిత్తప్ప, కరియన్న, శివన్న పాల్గొన్నారు.



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

ఓబుళదేవరచెరువు : మండలంలోని మిట్టపల్లి గ్రామ జడ్పీ హైస్కూల్‌లో 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 36 ఏళ్ల తర్వాత బాల్య స్నేహితులంతా ఓ చోట కలవడంతో భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదులను, ఆటలాడుకున్న క్రీడా మైదానంలో సంతోషంగా గడిపారు. అప్పటి గురువులు సత్యనారా యణ, నాగార్జునరావు, కొండారెడ్డి, రామాంజనేయులు, తదితరులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. వారి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో శంకర, నారాయణ, గోవిందరెడ్డి, పూర్వ విద్యార్థులు నిలోఫర్, బీమా, బి.పద్మావతమ్మ, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్, గంగాద్రి, బాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిప్పన్న, వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పునరుద్ధరణతో మహర్దశ

చిలమత్తూరు : మండలంలోని చెరువులకు కూటమి పాలనలో మహర్దశ వచ్చింది. గ్రామాల సాగు, తాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో చెరువుల అభివృద్ధి పనులు జోరుగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాలతో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చిలమత్తూరు, పాతచామలపల్లి, భూపసముద్రం, కోడూరు చెరువుల మరమ్మతులు చేపట్టారు. అలాగే నీటి వృథాను అరికట్టి, గట్లు, తూములు, కట్ట కాలువలను బలోపేతం చేశారు. రైతులకు సాగునీటి భద్రత కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లను ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శైలేశ్వర్, ఏఈ గౌతమ్‌నారాయణ, సాగునీటి సంఘం అధ్యక్షులు చిలమత్తూరు-కిషోర్, పాతచామల పల్లి-విశ్వనాథ్‌రెడ్డి, కోడూరు-గడ్డం కిష్టప్ప పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : వైసిపి

హిందూపురం : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణం లోని వైసీపీ కార్యాలయంలో కౌన్సిలర్ శివ అధ్యక్షతన హిందూపురం నియోజకవర్గ కురుబల ఆత్మీయ సమావేశం జరిగింది. ఉషశ్రీ చరణ్ తో పాటు కురుబ విభాగం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం రామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కౌన్సిలర్ శివతో పాటు హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి, కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో కురుబల గుడి కట్ల పూజారులకు నెలకు రూ. 5వేలు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని, ఈ విషయాన్ని మంత్రి సవిత, ఎంపి పార్థసారథిలు మోసం చేసిన బాబును ప్రశ్నించకుండా కురుబలను మోసం చేస్తున్నారని విమర్శించారు. వైసిపి బీసీలను గుర్తించి వారి ఎదుగుదలకు చేయూతను అందించడమే కాకుండా విరివిగా ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను కేటాయించిందన్నారు. ముఖ్యంగా కురబలను గుర్తించి ఒక ఎంపీ టికెట్ తో పాటు జిల్లాలో రెండు ఎమ్మెల్యే టికెట్లను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇద్దరు కురుబలను మంత్రులను చేసిన ఘనత వైసిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, కురుబలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

తండ్రీకొడుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో తండ్రి మృతి చెందగా కుమారుడు గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. కదిరి పట్టణానికి చెందిన బుదిలి అల్లాబకాష్ (50) బీడీల వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఈ క్రమంలో అల్లాబకాష్ చిన్న కుమారుడు రియాజ్‌తో కలిసి కదిరి నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా స్థానిక వెంకటసాయి ఐటిఐ సమీపంలో ఓ కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అల్లాబకాష్‌ను స్థానికులు 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రియాజ్‌కు గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి ఆ తర్వాత కదిరి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. అనంతపురానికి చెందిన మనోహర్, అతని భార్య విజయ్ కుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి స్కార్పియో వాహనంలో అనంతపురం వెళ్తుండగా ముందు వెళుతున్న కంటైనర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో విజయ్‌కుమారి తీవ్రంగా గాయపడడంతో అనంత పురం ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సిఐ శేఖర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

కొత్తచెరువు : స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఇరు వర్గాల ప్రజలు ఘర్షణ పడ్డారు. మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన బోయ అనిల్ కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పనుల కోసం కూలీలను పిలుచుకునేవారు. ఆ పనులకు కొత్తచెరువుకు చెందిన నరేష్ దంపతులు వెళ్లేవారు. ఈ క్రమంలో నరేష్ భార్యతో అనిల్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ విషయం బయట పడడంతో నరేష్ అనిల్‌ను మండలించాడు. దీంతో అనిల్ అనుచరులతో కలిసి నరేష్‌పై దాడి చేశారు. ఇరు వర్గాల వారు స్టేషన్ పక్కనే పరస్పర దాడులకు పాల్పడ్డారు. గమనించిన పోలీసులు అక్కడికి చేరుకుని దాడి చేసిన వారిని తరిమేసి బాధితులను స్టేషన్‌లోకి తీసుకెళ్లారు. ఇంతలో బాధిత అనిల్ దంపతులు పెట్రోల్ తీసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మారుతి శంకర్ తెలిపారు.

నిరుపయోగంగా పాఠశాల భవనం..!

అద్దె గదుల్లో తరగతుల నిర్వహణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం.

పట్టణంలోని 40వ వార్డులో గుట్టకిందపల్లిలో ఉన్న సర్వశిక్ష అభియాన్ ప్రైమరీ పాఠశాల భవనం నిరుపయోగంగా ఉంది. ఈ పాఠశాలలో 1 నుంచి 3వ తరగతి వరకూ విద్యార్థులకు బోధన జరిగేది. అయితే ఏ కారణాల వల్లో ప్రస్తుతం ఈ పాఠశాలను మూసివేసి ఇదే వార్డులో ఓ ప్రైవేటు భవనంలో ప్రభుత్వ సొమ్ముతో నెల నెలా అద్దె చెల్లిస్తూ తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాల భవనం చెత్త చెదారం, మురుగునీటితో అపరిశుభ్రంగా మారింది. ప్రభుత్వ భవనం ఉన్నా ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ ప్రైవేట్ భవనంలో పాఠశాల నిర్వహించడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇకనైనా మున్సిపల్, విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాల భవనాన్ని వినియోగం లోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-బుక్కపట్నం

సుమారు 19 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిం చుకుంటూ ఆనందోత్సవాల్లో గడిపారు. చిన్నప్పటి మధుర జ్ఞాపకాలు, చిలిపి పనులు, చిన్ననాటి గుర్తులు నెమరేసుకుంటూ ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. వాటికి మండల పరిధిలోని మారాల జిల్లా పరిషత్ ఉన్నత హైస్కూల్ వేదిక అయింది. 2006-07 విద్యా సంవత్సరంలో ఈ హైస్కూల్‌లో చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. దాదాపు 19 ఏళ్ల తర్వాత కలుసు కున్న బాల్య స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకుంటూ సంతోషంగా గడిపారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పించిన నాటి గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం పొందారు. అలాగే వారు చదువుకున్న పాఠశాలకు రూ. 65 వేలు అందజేసి, విద్యార్థుల భోజన వసతి కోసం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

జీవానంద పాఠశాలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్న స్థానిక జీవానంద ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఎఐఎఫ్‌డిఎస్) జిల్లా కార్యదర్శి సాయినాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జీవానంద పాఠశాల యాజమాన్యం పట్టణంతో పాటు రూరల్ ప్రాంతంలోని విద్యార్థులకు తరలించేందుకు ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతోందని ఆరోపించారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. ఆ పాఠశాల బస్సును మండలంలోని తుంపర్తి కాలనీ రహదారిలో రెండు రోజులుగా నిలిపివేశారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి బస్సు ఫీజుల పేరుతో వేలకు వేల రూపాయలు దోచుకుంటూ ఫిట్ నెస్ లేని బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని మండిపడ్డారు. బస్సు అద్దాలకు సెఫ్టీ గ్రిల్ లేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి జీవానంద పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎఫ్‌డిఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

చేనేత కార్మికుల కాంచీపురం 'స్టడీ యాత్ర'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు ధర్మవరం చేనేత మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ చేనేత కార్మికులు స్టడీ యాత్ర(ఎక్స్‌పోజర్ విజిట్) చేపట్టారు. ఇందులో భాగంగా వారు ఆదివారం తమిళనాడులోని కాంచీపురం వెళ్లారు. అక్కడ హ్యాండ్లూమ్ క్లస్టర్‌లో జరుగుతున్న ప్రొడక్ట్ అభివృద్ధి, స్కిల్ అప్ గ్రేడేషన్, అధునాతన పరికరాలు, డిజైన్లు, మార్కెటింగ్‌లో మెలకువలు, తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు కాంచీపురం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ఆలయాలను సందర్శించారు. ఐక్యత, క్రమశిక్షణకు ధర్మవరం చేనేత కార్మికులు పెట్టింది పేరని, మరోసారి చాటి స్టడీ టూర్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖ రాణి, గుంటూరు జిల్లా ఎడి వనజ, జిల్లా ఎడి రామకృష్ణ, ఎడిఒలు సుబ్బరా యుడు, శీనానాయక్, రాజేశ్వరి, చేనేత సంఘం నాయకులు గిరిరాజు నాగేష్, నేషనల్ అవార్డు గ్రహీత డిజైనర్ నాగరాజు, 30 మంది ధర్మవరం చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నూతన విషయాలు తెలుసుకుంటున్న చేనేత కార్మికులు